ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసులతో ఎస్పీ

శాంతి భద్రతలను పరిరక్షించాలి

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జూలై 29 : శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పని చేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. సోమవారం పట్టణంలోనిటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసులు, సైబర్ నేరాలు, షీ టీమ్‌ల పని విధానం, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 100 డయల్ కాల్స్‌పై పోలీసులు వెంటనే స్పందించాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఇన్వెస్టిగేషన్‌ను పూర్తి ఆధారాలతో, పారదర్శకంగా చేసి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. పోలీసస్టేషన్‌లో బాధితులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేపట్టాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను తెలుకోవాలన్నారు. నేరం చేసిన వారికి తప్పనిసరిగా శిక్ష పడేలా ఆధారాలతో కోర్టులో హాజరు పర్చాలన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. నేరాల నియంత్రణకు నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ సాంకేతికతను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి వారం కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం నిర్వహించాలని, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిభ, నైపుణ్యం, కేసులను త్వరగా పరిష్కరించిన పోలీస్ అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్డు

అవస్థలు పడుతున్న ప్రజలు

అధ్వానంగా మారిన రోడ్డును చూపిస్తున్న నక్క హరీశ్

నెల్లికుదురు, జూలై 29 : మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో తూర్పు చెరువు కట్ట శివారు నుంచి శనిగకుంట తండాకు వెళ్లే రోడ్డు చినుకుపడి చిత్తడవుతున్నది. పొలాలకు వెళ్లే రైతులు, గొర్ల కాపరులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. శనిగకుంట తండా నుంచి విద్యార్థులు మేచరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఈ దారిగుండానే వెళ్తున్నారు. బురదయమంగా మారి, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండడంతో విద్యార్థులు పడుతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-2** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **గుండ మంగమ్మ**, W/o : బాబు, **వయస్సు :** 49 సం||లు, **వృత్తి :** గృహిణి, **నివాసం :** ఇ.నెం. 4-24, చిల్కోడు, డోర్నకల్ మండలం, మహబూబాబాద్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : గ్రామపంచాయితి చిల్కోడు, మండలం, మండల పరిషత్తు డోర్నకల్, రెవిన్యూ జిల్లా, జిల్లా పరిషత్తు మహబూబాబాద్, జిల్లా రిజిస్ట్రారు వరంగల్, సబ్ రిజిస్ట్రారు మహబూబాబాద్ వారి పరిధిలోగల చిల్కోడు రెవిన్యూ గ్రామములోని గ్రామ పంచాయితి డోర్ నెం. 4-24A (Assessment No. 1196) నకు సంబంధించిన R.C.C. కప్పు గల గృహము నిర్మిత విస్తీర్ణం. 440.16 చ||ఫీట్లు|| గృహముతో సహ మొత్తం ఖాళీ స్థల విస్తీర్ణము 237.72 చ||గ||లు, సమము. 198.76 చ||మీ||లు, **డాక్యుమెంట్ నెం. 6878/2024** గల ఆస్తికి హద్దులు : **తూర్పు:** గల్లి, **పడమర :** గాదే నాగేశ్వర్ రావు గారి భూమి, **ఉత్తరం :** కాడెం సైదులు గారి స్థలము, **దక్షిణం :** కాడెం సైదులు గారి స్థలము.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, **RUMANA FATHIMA** (New Name), previously called **RUMAN FATIMA** (Old Name), and residing at H.No. 25-8-441/1, Bapuji Nagar, Kazipet, Hanumakonda Dist.- 506003, T.S., India. and solemnly declare.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

అందని సర్కారు వైద్యం

- గార్ల సీహెచ్‌సీలో వైద్యుల కొరత
- పేరుకే పెద్దాస్పత్రి.. ఒక్కవైద్యుడితోనే సేవలు
- రోగుల ఇబ్బందులు పట్టించుకోని పాలకులు
- గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

గార్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్

గార్ల, జూలై 29 : వైద్యారోగ్య శాఖ, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం గార్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు సరిగ్గా వైద్యం అందడం లేదు. పట్టించుకునే వారు లేకపోవడంతో ఇక్కడి వైద్యులు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోనే పెద్ద దవాఖాన పేరున్న గార్ల సీహెచ్‌సీలో 10 మంది వైద్యులుండగా, వీరిలో 8మంది బదిలీపై, ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లగా, ప్రస్తుతం కేవలం ఒక్కరే వైద్యుడు సేవలు అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, పాము కాటు, ప్రసవాల వంటి అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇక్కడి వస్తే మొక్కుబడి వైద్యం చేసి మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు రిఫర్ చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసింది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా మార్చి 30 పడకలను ఏర్పాటు చేసింది. సుమారు రూ.5కోట్లతో అధునాతన హంగులు కల్పించారు. దవాఖానకు ప్రతి రోజూ 100 నుంచి 150 వరకు ఓపీ రోగులకు వైద్య సేవలు అందించేవారు. కానీ, ప్రస్తుతం ఇక్కడ పని చేసిన వైద్యులందరూ బదిలీపై వెళ్లడం, కొత్త వారిని నియమించకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందడం లేదు. ఇక్కడే పని చేసే కొందరు వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. బస్సులు, రైళ్లలో రాకపోకలు సాగిస్తూ, సమయానికి దవాఖాన రావడం లేదని రోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దవాఖానలో సరిపడా వైద్యులను నియమించి, మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడాలి

అసెంబ్లీ సమావేశాల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గార్ల సీహెచ్‌సీ పరిస్థితిపై మాట్లాడాలి. గార్ల మండలంలోని ప్రజల అవస్థలను వివరించాలి. గ్రామాలు, తండాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడి అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడి వైద్యులను నియమించాలి. లేకపోతే రాస్తారోకోలు, ధర్నాలు చేస్తాం.
– *కందునూరి కవిత, ఐద్వా సంఘం జిల్లా అధ్యక్షురాలు*

పెద్ద చెరువును బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా మార్చాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

బయ్యారం, జూలై 29 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బయ్యారం పెద్ద చెరువును బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా మార్చాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కోదండరామ ఫంక్షన్ హాల్‌లో గునిగంటి రాజన్న అధ్యక్షతన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేలా గతంలో సీతారామ ప్రాజెక్టుకు రోళ్లపాడు వద్ద శంకుస్థాపన చేశారని తెలిపారు. కానీ, డిజైన్ మార్చి ఇల్లెందుకు అన్యాయం చేసి సత్తుపల్లి, వైరా ప్రాంతాలకు లబ్ధి చేకూరేలా చేశారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే పాత డిజైన్ ప్రకారమే రోళ్లపాడు వద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించి ఇల్లెందు నియోజకవర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద చెరువు కాల్వకు శాశ్వత మరమ్మతు చేపట్టాలన్నారు. లేకపోతే సీపీఎం అనుబంధ ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా విభజన చట్టంలో పేర్కొన్నవిధంగా బయ్యారం ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సూర్నపాక సోమయ్య, అలవాల వీరయ్య, ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, మండా రాజన్న, మండల కార్యదర్శి నంబూరి మధు, వల్లాల వెంకన్న పాల్గొన్నారు.

ఇలాగైతే 'పంచాయతీ'లో కష్టమే..?

కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి నాయకుల సమావేశం

విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్తామన్న నాయకులు

పుల్లూరు సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి

గార్ల, జూలై 29 : గార్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య వర్గపోరు కొనసాగుతున్నది. సోమవారం పుల్లూరు గ్రామంలో కొందరు కాంగ్రెస్ నాయకులు అసమ్మతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కానీ, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారే పెత్తనం చేస్తున్నారని అన్నారు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఓ నాయకుడైతే 'తాను చెప్పిందే వేదం.. ఏ విషయం అయినా నా దగ్గరకు రావాలి' అని కాంగ్రెస్ పార్టీపై పెత్తనం చెలాయిస్తున్నాడని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ పని చేయాలన్నా మొదటిగా తనను సంప్రదించాలంటున్నాడని కాంగ్రెస్ అసమ్మతి నాయకులు ఆవేదన చెందుతున్నారు. ఈ విధంగా రాజకీయం చేస్తే పంచాయతీ ఎన్నికల్లో ఓటమి పొందే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి వందలాది కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పా రు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి, తుమ్మల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆళ్ల సాంబశివరావు, రావూరి వెంకట్రామయ్య, గుండా వెంకట రెడ్డి మాలోత్ వెంకట్ లాల్, షాంశాద్ భేగం, తాళ్ళపల్లి కృష్ణ గౌడ్, అతీరాం, సత్య నారాయణరెడ్డి పాల్గొన్నారు.

తొర్రూరులో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ కార్యదర్శి భాస్కర్

న్యాయస్థానాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలి

తొర్రూరు, జూలై 29: న్యాయస్థానాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో మాల, మహర్ అనుబంధ కులాల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితులను విచ్ఛిన్నం చేసే కుట్రలను మానుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. బీసీలకు చట్ట సభలో రిజర్వేషన్ల చట్టం తీసుకురావాలని, రాజ్యాంగాన్ని అమలు చేసే పాలకులు కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని కోరారు. అనేక జాతీయ స్థాయి డిమాండ్ల సాధన కోసం జాతీయ మాల మహానాడు ఢిల్లీ వేదికగా పోరుబాటుకు సిద్ధమైందన్నారు. ఆగస్టు 7,8,9 తేదీల్లో ఢిల్లీలో సామాజిక చైతన్య దీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కర్ వాదులు, మాల బిడ్డలు, బీసీలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆగస్టు 1న మహబూబాబాద్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి జిల్లాలో ఉన్న మాలలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. మండల అధ్యక్షుడు అనపర్తి నాగేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేశ్, బీఎంజేసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డు అశోక్, తొర్రూరు పట్టణ అధ్యక్షుడు గార అనిల్, జిల్లా ప్రచార కార్యదర్శి చదల యాకాంతం, మాల యువత జిల్లా నాయకులు రాకేశ్, నెల్లికుదురు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, యనమల శ్రీనివాస్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీసీ రోడ్డు నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్, జూలై 29 : విద్యార్థులకు హాస్టల్‌కు వెళ్లేందుకు సీసీ రోడ్డును నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేశ్ కోరారు. సోమవారం పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో రోడ్లు బురదమయంగా మారడంతో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న పాటి వర్షానికే మట్టి రోడ్డు బురదమయంగా మారుతున్నదని, దీంతో హాస్టల్ విద్యార్థులు ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి హాస్టల్‌కు వెళ్లేందుకు సీసీ రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, వికాస్, చరణ్, ఉదయ్ పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి

పేద మహిళలకు చీరెలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

తొర్రూరు, జూలై 29 : అభాగ్యులకు అండగా నిలిచి సేవ చేస్తే ఎంతో సంతృప్తి కలుగుతుందని లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్లు డాక్టర్ కే రాజేందర్‌రెడ్డి, తమ్మెర లక్ష్మీ నర్సింహారావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు మాజీ కోశాధికారి చీదర మహేశ్ జన్మదినం సందర్భంగా సోమవారం తొర్రూరులోని వేమననగర్‌లో 30 మంది మహిళలకు చీరెలను పంపిణీతోపాటు అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ రేగూరి శ్రీదేవి, డాక్టర్ పీ కిరణ్‌కుమార్, దామెర సరేశ్, క్లబ్ ప్రధాన కార్యదర్శి తమ్మి రమేశ్, కోశాధికారి బోనగిరి శంకర్, ముడుపు రవీందర్‌రెడ్డి, దారం కుమారస్వామి, గోపారపు చంద్రమౌళి, చీదర నీలిమ పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం రైతుల ఆందోళన

జయ్యారం ఇండియన్ బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

చిన్నగూడూరు, జూలై 29 : ఇంతవరకు తమకు బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు పడలేదంటూ జయ్యారం, మంగోరిగూడెం, మేఘ్యాతండా గ్రామాలకు చెందిన రైతులు సోమవారం జయ్యారం ఇండియన్ బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. బ్యాంకు, వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో తమకు రుణమాఫీ కాలేదన్నారు. మొదటి విడుతలో రూ.లక్షలోపు రుణాల మాఫీకి అర్హులైన రైతులు బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నారని ఆవేదన చెందారు. ఇండియన్ బ్యాంకు ఖాతాదారులెవరికీ రుణమాఫీ జరుగలేదని, రైతుల ఒరిజనల్ పట్టాపాస్ బుక్‌లు బ్యాంకు అధికారుల వద్దే పెట్టుకున్నట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో రుణమాఫీ కాకపోతే పెద్ద సంఖ్యలో రైతులందరం తరలివచ్చి మహా ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు గుగులోత్ రవి, బొమ్మ ఉప్పలయ్య, బాదావత్ రెడ్డి, బండి వెంకన్న, నూనావత్ కీమారెడ్డి, బత్తిని శ్రీనివాస్, చిరంజీవి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల వెతలు

పోస్టాఫీస్ ఎదుట సీతానగరం గ్రామ పింఛన్‌దారులు

గూడూరు, జూలై 29 : సెల్ టవర్ సిగ్నల్ సరిగాలేక పింఛన్‌దారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో ఆసరా పింఛన్లు తీసుకునే వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు నెలవారీ పింఛన్ తీసుకోవాలంటే సెల్‌టవర్ సిగ్నల్ సరిగాలేక, పక్కనే 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న భూపతిపేట గ్రామానికి వెళ్లాల్సి వస్తున్నది. సీతానగరంలో ఉన్న సబ్ పోస్టాఫీస్ ప్రాంతంలో, గ్రామంలో ఎక్కడా సరిగా నెట్‌వర్క్ రావడం లేదు. దీంతో ఐదు నెలల నుంచి పింఛన్‌దారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే పోస్టాఫీస్ వద్ద సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పింఛన్‌దారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

తొర్రూరు, జూలై 29 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థులంతా సంఘటితంగా ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ నర్సింహారావు పిలుపునిచ్చారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ)డివిజన్ నిర్మాణ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించి పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పీడీఎస్‌యూ తొర్రూరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా బీ నందీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రామ్‌చరణ్, ఉపాధ్యక్షుడిగా లోకేశ్, సహాయ కార్యదర్శిగా గణేశ్, కోశాధికారిగా నరేందర్, సభ్యులుగా వీరన్న, సిద్ధు, రవీందర్, డీ సాయి, ఎల్ సుమన్, రవీందర్, సాగర్‌ను ఎన్నుకున్నారు.

31న చలో అసెంబ్లీ

.తొర్రూరు, జూలై 29 : విద్యారంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో కనీస నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 31న నిర్వహించనున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గౌడిశాల మనోజ్ పిలుపునిచ్చారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని సీపీఐ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ, పీవైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపులో చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తూ బడ్జెట్‌లో కేవలం 7.31శాతం నిధులు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి 30 శాతం నిధులను కేటాయించాలన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీల వివరాలను అసెంబ్లీలో వెల్లడించాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ డివిజన్ ఉపాధ్యక్షుడు ఉడుత వేణు, సహాయ కార్యదర్శి మార్త వినిల్, కోశాధికారి పొడిశెట్టి వినయ్, నాయకులు సందీప్, సోమేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

తొర్రూరు, జూలై 29 : వివాహాది శుభకార్యములు, విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తామని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. తొర్రూరు డిపో పరిధిలోని ప్రజలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను కిలోమీటర్లు, సమయం ప్రాతిపదికన అద్దెకు ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమున్నవారు 9959226053, 70321 82456, 9989148206 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

చిన్నగూడూరు(మరిపెడ), జూలై 29 : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు గోవర్దన్, ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 3న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కొందరు ఉపాధ్యాయులు అక్రమ డిప్యుటేషన్ల పేరుతో డీఈవో కార్యాలయంలో చేరి అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. గతంలో ఎంఈవోగా పని చేసిన పూల్‌చంద్ కాలంలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నందిగామ జనార్దనాచారి, శ్యామ్, మంగులు పాల్గొన్నారు.

వచ్చే నెల2న కలెక్టరేట్ ముట్టడి

మహబూబాబాద్ రూరల్, జూలై 29 : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ ఆధ్వర్యంలో వచ్చే 2న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారధి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సమస్యల పరిష్కారం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పేదలకు ఇండ్ల పట్టాల పంపిణీ, శివారు కాలనీలకు మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై నిర్వహిస్తామని, అన్ని మండలాల సీపీఐ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయం చేయాలని కోరారు.

కరెంట్ సౌకర్యం కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, జూలై 29 : కరెంట్ సౌకర్యం కల్పించాలని మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని మంద కొమురమ్మ కాలనీ వాసులు ఎండీ రజియా, వంగర సరిత, డీ పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పది సంవత్సరాల క్రితం 280మంది కలిసి కాలనీ ఏర్పాటు చేసుకుని నివాసముంటున్నామని, అందులో కొంతమందికి ఇంటి పట్టాలు, నంబర్లు సైతం అధికారులు మంజూరు చేశారని అన్నారు. ఇప్పటివరకు విద్యుత్ స్తంభాలు లేక కరెంట్ సౌకర్యం కల్పించలేదని, ఓ ప్రైవేట్ వ్యక్తి పరిశ్రమ కోసం మీటర్ తీసుకుంటే అదే మీటర్ నుంచి కొంతమంది కరెంట్‌ను వాడుకుంటున్నారని, మిగతా వారు అంధకారంలో గడుపుతున్నట్లు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

కేసముద్రం, జూలై 29 : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీ రాజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (కంప్యూటర్స్ అప్లికేషన్స్), బీ కాం కంప్యూటర్స్), బీఎస్సీ (కంప్యూటర్స్)లో అడ్మిషన్లు ఇస్తున్నట్లు తెలిపారు.కేసముద్రం పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి అంతస్తులో డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

కేసముద్రం, జూలై 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు గొడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం తాళ్లపూసపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2500 చొప్పున తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా చాలామంది లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడడంలేదని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కావడం లేదన్నారు. తాళ్లపూసపల్లి గ్రామం అంబేద్కర్ కాలనీలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు అందించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, సరిత, లక్‌పతి, కుంట సంపత్, జ్యోతి, శారద, నరసమ్మ, రజిత, ఉపేందర్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

డోర్నకల్, జూలై 29 : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ వచ్చే నెల 3న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, యూటీఎఫ్ మండల నాయకులు శ్రీను, శంకర్, సాహెబ్ అలీ, మారెడ్డి, రాములు, సీతారాములు, లక్ష్మీప్రసాద్, బుచ్చయ్య, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డోర్నకల్, జూలై 29 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన డోర్నకల్ శివారులోని మైనార్టీ స్కూల్ సమీపంలో సోమవారం జరిగింది. వెన్నారం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు ద్విచక్రవాహనంపై డోర్నకల్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో డోర్నకల్ శివారులోని మైనార్టీ స్కూల్ వద్ద గేదె అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో నాగేశ్వర్‌రావుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఆటోలో ఖమ్మం తరలించారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

మహబూబాబాద్ రూరల్, జూలై 29 : సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ప్రభుత్వంపూర్తిగా విఫలమైందని ప్రగతి శీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కందాల రంగయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించడంతోపాటు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో అనిల్, ప్రవీణ్, సంతోష్, మధు పాల్గొన్నారు.

కరెంట్ ఏఈని బదిలీ చేయాలి

గార్ల, జూలై 29: మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఏఈ మహేందర్‌బాబుకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, వెంటనే అతడిని బదిలీ చేయాలని జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరిగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, కరెంట్ మరమ్మతు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ ఏఈ బదిలీ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ ఢీ కొని ఒకరికి గాయాలు

నర్సింహులపేట, జూలై 29 : ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన మండలంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తొర్రూరు మండలానికి చెందిన మద్దెల సురేశ్ తొర్రూరు మండల కేంద్రంలో ఓ ట్రాక్టర్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ట్రాక్టర్ అమ్మకం నిమిత్తం కౌసల్యదేవిపల్లి నుంచి నర్సింహులపేట వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా, రామన్నగూడెం శివారు ఆకేరు వాగు నుంచి జిల్లా కేంద్రానికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో సురేశ్ చెయ్యి విరిగిపోయింది. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.